


# మధ్యవర్తిత్వం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సికింద్రాబాద్

హేమపురంలో నివశించే రామరాజు, శేషంరాజు జమీందార్లు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత శతృత్వం వుంది. వాళ్ళిద్దరి మూలంగా ఊరే రెండుగా చీలిపోయింది. అయితే వాళ్ళిద్దరి వైరంతో లాభపడిన వాళ్లు కొందరుంటే, వాళ్ళిద్దరూ కలిస్తే ఊరు బాగుపడుతుందని ఆశావహ దృక్పథం కలవారు మరికొందరున్నారు.

ఇదిలా వుండగా ఆ ఊళ్ళో వెంకయ్య అనే రైతు తన అయిదెకరాల పొలం అమ్ముదామనుకున్నాడు. అది సరిగ్గా రామరాజు, శేషంరాజు పొలాల మధ్యలో వుంది. అందుచేత దాన్ని కొనుక్కోవాలని ఇద్దరూ పోటీలు పడ్డారు. ప్రయత్నాలు మొదలుపెట్టారు. అది రాన్రాను పంతాలు, పట్టింపులు, గొడవల దాకా దారి తీసింది. అదే ఊళ్ళో మాస్టారుగా పనిచేసే రాంప్రసాద్ దీన్ని ఒక అవకాశంగా తీసుకుని వాళ్ళిద్దరిని కలపాలని, ఊరికి కలిసొచ్చేలా చేయాలని నిర్ణయించుకుని, ఆ సమస్యను తీర్చే మధ్యవర్తిగా తనని తాను ఊరివాళ్ళకి పరిచయం చేసుకుని ముందుగా రామరాజు ఇంటికి వెళ్ళాడు.

"అయ్యా, మీ స్థాయీ, తాహతు ఊళ్ళో అందరకూ తెలుసు. ఆ పొలం మీరు మాత్రమే కొనగలరు. అయితే శేషం రాజు అడ్డువస్తున్నాడని మీరు అనుకుంటున్నారు... కానీ, శేషం రాజుగారికి మీరంటే చాలా గౌరవం. కేవలం మధ్యవర్తులు తమ పబ్బం గడుపుకోవటం కోసం చాడీలు చెప్పి మీ మధ్య వైరాన్ని పెంచుతున్నారు. ఇక్కడికి వచ్చేముందు శేషం

రాజుగారింటికెళ్ళాను. అప్పుడు తెలిసింది ఈ విషయం. మీరిద్దరూ కలిసుంటే ఎన్నో ఏళ్ళముందే మీరు స్నేహితులయ్యేవారు. ఊరు బాగుపడేది. మీకు నా మీద నమ్మకం లేకపోతే వచ్చే ఆదివారం శ్రీ రామాలయంలో ఏర్పాటు చేసే భోజనాలకి రండి. విషయం మీకే తెలుస్తుంది" అన్నాడు.

ఆ తర్వాత శేషంరాజు ఇంటికి వెళ్ళి రామరాజుకి చెప్పినట్టే చెప్పి శ్రీరామాలయంలో భోజనానికి రావడానికి ఒప్పించాడు.

ఆదివారం.

శ్రీ రామాలయంలో ఇద్దరూ ఒకరికి ఒకరు పడ్డారు. మధ్యలో ఎవరూ లేకపోవడం వల్ల కక్షలూ, కార్పణ్యాలు గుర్తుకు రాలేదు.కపైగా ఒకరి ఆధిపత్యాన్ని మరొకరు అంగీకరించారని రాంప్రసాద్ చెప్పిం వుండటం వల్ల అహం తృప్తి పడి మనుషులు మెత్తపడ్డారు. ఇద్దరూ పెద్దరికంతో మాట్లాడుకోవడం వల్ల ఉమ్మడిగా ఒక తీర్మానం చేశారు. అదేమిటంటే 'తామిద్దరూ ఎప్పటికీ కలిసే వుంటారు. ఊరి బాగే వాళ్ళ ధ్యేయం. ఇప్పటికే తమకి బోలెడన్ని పొలాలు, ఆస్తి పాస్తులు ఉన్న మీదట, వెంకయ్య పొలాన్ని సరైన ధర చెల్లించి ఇద్దరూ కొనుగోలు చేస్తారు. దానిమీద వచ్చే ఫలసాయాన్ని ఆ ఊరి బీదవారికి దానం చేస్తారు' అని.

నిజంగా ఆ రోజు ఆ ఊరికి పండగయింది. రెండు శక్తులు ఏకమయ్యాయి. ఊరికి బలమయ్యాయి.

మధ్యవర్తిత్వం అనేది బాధ్యత. అది నెరవేర్చే మనిషి మానవతావాది అయివుండి, అరిషడ్వర్గాల ఉనికి సోకనివాడై వుండాలి. అప్పుడే అది ఫలవంతమవుతుంది. ప్రయోజకరమవుతుంది.

రాంప్రసాద్ నెరపిన మధ్యవర్తిత్వం నిప్పుల గుండంలాంటి ఊరిని ఉదకమండలం చేసింది. అందరూ చల్లగా సేదదీరుతున్నారు.

